




మన్నెం శారద

రాత్రి ఎనిమిదీ తొమ్మిది గంటల మధ్య!

హోటల్ అప్సరా ముందర ఒక ఎంబాసిడర్ కారాగింది. ఆగీ ఆగగానే అందులోంచి నల్గురు వ్యక్తులు దిగి హడావుడిగా లిఫ్ట్‌వేపు వచ్చి లిఫ్ట్ రావడం ఆలస్యమవుతుందన్నట్లుగా గబగబా మెట్ల మీదుగా థర్డ్‌ఫ్లోర్ చేరుకొని రూం నెంబర్ నూటఒకటి బజ్జర్ నొక్కేరు.

తలుపు వెంటనే తెరచుకొంది.

అక్కడ మరో నల్గురు వ్యక్తులు ఆత్రుతగా వీరికోసమే నన్నట్లుగా ఎదురు చూస్తున్నారు. ఎదురుగా టీపాయ్ మీద ఖాళీ చేసిన సీసాలు, సిగరెట్ పాకెట్‌లు, యాష్‌ట్రేల నిండా చెత్త — ఇంతసేపు వాళ్ళు దేనికోసమో తీవ్రంగా ఆలోచిస్తున్నారనే విషయాన్ని తెలియజేస్తున్నాయి.

బయట నుంచి వచ్చిన వ్యక్తుల్ని చూడగానే రూంలో కూర్చుని ఎదురు చూస్తున్న వ్యక్తులలో ఆత్రుత పెరిగింది.

''దొరికిందా?'' అన్నారొక్కసారి కోరస్ పాడినట్లుగా. బయట నుండి వచ్చిన ఆ నల్గురూ తలలు దించుకొన్నారు.

''దొరకలేదా?'' అన్నారు వాళ్ళు మళ్ళీ ఆత్రుతగా. ''లాభం లేదు సార్! అంతా గాలించేసేం! ఇక్కడా, అక్కడా అని వదల్లేదు'' అన్నాడొకతను నిస్సహాయంగా చూస్తూ.

''ఎక్కడా లేదని ఇక్కడ వుందని తెలిస్తే ఇక్కడా దొరక లేదా? ఇప్పుడేం చేయాలి?'' అన్నాడొకతను మిగతా ముగ్గురి వేపూ చూస్తూ.

''మూడు రోజుల క్రితం యిక్కడ వుండటం చూశానని ఖచ్చితంగా చెప్పేడు నా ఫ్రెండ్!'' అన్నాడందులోని ఒక వ్యక్తి.

''అవున్సార్! ఎవరో వచ్చి పట్టుకెళ్ళి పోయేరట!''

అంతే! ఆ మాట విని ఆ నల్గురూ నిటారుగా నిలబడిపోయేరు.

''వ్వాట్! పట్టుకెళ్ళిపోయేరా?''

''అవున్సార్! నిన్ననే ఒకతను పట్టుకెళ్ళినట్లు తెలిసింది.'' వాళ్ళు మొహాలు చూసుకున్నారు.

''నోడౌట్! ఇది వాడి పనే!'' అన్నాడొక వ్యక్తి పళ్ళు నూరుతూ.

''వాడేనంటావా?''

''డెఫినెట్! దీని గురించి వాడూ ప్రయత్నిస్తున్నాడని తెలిసింది. అది వాడికి దొరకడానికి వీల్లేదు. పదండి.'' అతను ఉరుకుతున్నట్లుగా ముందుకి దారితీస్తే అతన్ని అనుసరించేరందరూ.

* * *

రూం నెంబర్ 101 లో ఏదో ఇంటర్నేషనల్ స్మగ్లింగ్ గాంగ్ వున్నట్లుగా అనుమానంగా వుంది సార్! వాళ్ళు దేనికోసమో తీవ్రంగా గాలిస్తున్నారు. మా బాయ్ విని అనుమానంతో నాకు చెబితే మీకు రిపోర్టు చేస్తున్నాను. వాళ్ళంతా ఇప్పుడే హడావుడిగా ఇసకవీధి కెళ్ళేరని తెలుస్తోంది. ఒ.కె. సార్!'' అంటూ ఫోను పెట్టేసేడు మానేజర్.

* * *

ఎవరో వచ్చేరని తలుపు తీసిన లక్ష్మీకాంతం వాళ్ళని చూసి అలాగ్గే స్థాణువులా నిలబడి పోయింది.

''ఎవరే?'' ముసుగుతన్ని పడుకోబోతూ భార్యని అడిగేడు సుబ్బారావు.

''బ...బ...బంది...పో.....'' ఆవిడ మాట పూర్తి కాకుండానే అందరూ సీరియస్‌గా లోపలికెళ్ళి బీరువాలు, అలమరలు వెదకసాగేరు.

ఒకడు వీధి తలుపు మూసి నిలబడ్డాడు.

సుబ్బారావు అమాంతం లేచి కూర్చుని అరవబోయేడు. ''అరిచేవా ఖంపేస్తాం. మర్యాదగా అదెక్కడ దాచేవో చెప్పు!'' అన్నారు వాళ్ళు ఫీంకరిస్తూ.

''నా... నా దగ్గర లేదు'' అంటు కీచుగా చెప్పేడు సుబ్బారావు.

''నువ్వు మర్యాదగా అడిగితే ఇవ్వవు!'' అంటూ రాక్స్ బద్దల గొట్టసాగేరు.

గంట గడిచింది. సుబ్బారావు, అతని భార్య దీనంగా ఓ మూల వొదిగి చూస్తున్నారు.

''ఈ రాక్ తాళం రావడం లేదు బాస్!''






"అయితే డెఫినెట్‌గా అందులోనే వుండుంటుంది. మర్యాదగా తాళం యివ్ సుబ్రావ్!" అన్నాడొకతను కోపంగా.

"నేను ఛస్తే యివ్వను. అది నా ప్రాణం" అంటూ గింజుకుంటున్నాడు సుబ్బారావ్.

*　　*　　*

"మాపై ఎపార్టుమెంటులో ఏదో గందరగోళం జరుగుతోంది. ఎవరో కార్లో వచ్చి దోచుకుంటున్నారు."

"ఇసక వీధేనా?"

"అవున్సార్!"

ఇన్‌స్పెక్టర్ ఏకాంబరం హడావుడిగా లాఠీ తీసుకొని నలుగురు కానిస్టేబుల్స్‌తో జీప్‌లో ఇసకవీధి కొచ్చేసేడు.

*　　*　　*

"పోలీసులు! పోలీసులు!"

ఏకాంబరం ఠీవిగా లోపలికి ప్రవేశించేడు. ఆ వెనుకే కానిస్టేబుల్స్ అనుసరించేరు.

"ఏం జరుగుతోందిక్కడ? ఏం వెదుకుతున్నారు?" అంటూ చుట్టూ చూశాడు ఏకాంబరం.

పోలీసుల్ని చూసి అందరూ స్థాణువుల్లా నిలబడిపోయేరు.

"ఎందుకిలా ఇల్లంతా చిందర వందర చేస్తున్నారు! దేనికోసం? అన్నాడు ఇన్‌స్పెక్టర్ లాఠీ ఊపి గర్జిస్తూ.

"మేం... మేం..." అన్నాడు ఒకతను పెదవులు తడి చేసుకుంటూ.

"బందిపోట్లు కాదు. ఆ సంగతి నాకు తెలుసు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఏకాంబరం వాళ్ళవైపు అదోలా చూసి నవ్వుతూ.

"అవున్సార్! మేమంతా ఉద్యోగస్థులం! మేం వెదుకుతున్నది..."

"నాకు మీరింకేం చెప్పనక్కర్లేదు. మీరు ఇంటర్నేషనల్ స్మగ్లింగ్ గాంగ్ అని మాకెప్పుడో న్యూస్ అందింది. నా అదృష్టం కొద్దీ మీరంతా ఈ ఊరొచ్చి నేను అట్టే కష్టపడకుండా నా చేతికి దొరికిపోయేరు. ఈ దెబ్బతో నాకు ప్రమోషన్ ఖాయం. ఏం వుంది ఆ రాక్‌లో! తాళం యివ్వు!" అంటూ సుబ్బారావు వైపు చెయ్యి చాపేడు ఏకాంబరం.

సుబ్బారావు ఏడుపు మొహంతో తాళం అందించేడు.

ఇన్‌స్పెక్టర్ రాక్ తాళం తీస్తుంటే వాళ్ళంతా ఆందోళనగా నిలబడ్డారు.

ఏకాంబరం తాళం తీసి లోపలికి చూశాడు. ఏం కనపడలేదక్కడ. చెయ్యిపెట్టి మెల్లిగా తడిమేడు. అతని చేతికి దొరికిన వస్తువు చూసి ఆశ్చర్యపోయి "దీని కోసమా?" అన్నాడు.

"అవున్సార్!" అన్నారందరూ కోరస్ పాడినట్లుగా.

"ఎందుకిది?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఛీదరింపుగా పడెయ్యబోతూ.



"అంత మాటనకండి సార్! అవే మమ్మల్నింత గొప్పవాళ్ళని చేసింది!" అన్నాడొకతను.

"ఎవరు మీరంతా? సరిగ్గా చెప్పండి! నాకేం అర్థం కావడం లేదు!" అన్నాడు ఏకాంబరం జుట్టు పీక్కుంటూ.

"ఏం లేదు సార్! అదొక పాత ఇంగ్లీషు నవల. మేమంతా రచయితలం. మమ్మల్ని ఇంత గొప్పవాళ్ళుగా మార్చిన పుస్తకాలవే సార్! వీడు ఈ మధ్య మాకు దొరక్కుండా వీటిని స్పీడుగా ట్రాన్స్‌లేట్ చేసి గొప్పవాడయిపోతున్నాడు. ఈ నవల మాకంటే ముందు వాడు కాజేసి దాచేసేడు. ఎలాగయినా దీన్ని వాడికి దక్కనివ్వకూడదని వచ్చేం!" అన్నారు వాళ్ళంతా.

విషయం అర్థమయి ఏకాంబరం ఇల్లెగిరేలా నవ్వేడు. "బాగుంది! ఇంత తేలిగ్గా గొప్పవాళ్ళవ్వచ్చన్న విషయం తెలీక నేను ప్రమోషన్ కోసం అడ్డమైన పాట్లూ పడుతున్నాను. దీన్ని నేనే అనువదించి మీకన్నా గొప్ప వాణ్ణయిపోతాను. మీరిక మర్యాదగా వెళ్ళిపోండి. మిమ్మల్ని దయతలచి వదిలేస్తున్నాను!" అంటూ నవలని చంకలో పెట్టుకొని వెళ్ళిపోయేడు ఏకాంబరం.